పరిశోధనల్లో విద్యావేత్తల కృషి అభినందనీయం

- హెచ్‌సీయూను సందర్శించిన కేంద్రమంత్రి సుకాంత్ మజుందార్



రీసెర్చ్ స్కాలర్‌తో సంభాషిస్తున్న కేంద్రమంత్రి సుకాంత్, చిత్రంలో వర్సిటీ వీసీ బీజేరావు తదితరులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పరిశోధనల్లో విద్యావేత్తల కృషి అభినందనీయం అని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుకాంత్ మజుందార్ అన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. కేంద్రమంత్రికి వర్సిటీ వీసీ బీజేరావు, రిజిస్ట్రార్ దేవేష్ నిగమ్ సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులు, ఆచార్యులతో కేంద్రమంత్రి సంభాషిస్తూ.. దేశ భవిష్యత్ రూపకల్పనలో నాణ్యమైన విద్య, ఆవిష్కరణలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. పరిశోధనల్లో విద్యావేత్తల కృషి, కమ్యూనిటీ ఔట్‌రీచ్‌లో శ్రేష్ఠతను సాధించడంలో విశ్వవిద్యాలయం పనితీరును ఆయన ప్రశంసించారు. యూనివర్సిటీ విజన్‌కు అనుగుణంగా విద్య, నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాలపై కూడా మంత్రి చర్చించారు. లైఫ్ సైన్సెస్ విభాగంలోని యాస్పైర్ బయోనెస్ట్(నాలెడ్జ్ బేస్డ్ ఇంక్యుబేటర్)ను సందర్శించిన మంత్రి అక్కడి స్టార్టప్‌ల అభివృద్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' ప్రచారంలో భాగంగా క్యాంపస్‌లో ఒక మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాల ఉన్నతాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలు ఎలా?

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి డిసెంబర్ 9వ తేదీ నాటికి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో ఈనెల 14వ తేదీ నుంచి 26 రోజుల పాటు ప్రజాపాలన విజయోత్సవాలు ఉంటాయని ప్రభుత్వం ప్రకటించింది. కానీ కూకట్‌పల్లిలో ఎప్పుడు ? ఎలా ? ఎక్కడ? అనేది అర్థం కాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ కూకట్‌పల్లి నియోజకవర్గంలో మాత్రం ఆ పార్టీకి సంబంధించి ఒక్క ప్రజాప్రతినిధి కూడా లేరు. దీంతో అధికారులను సమన్వయం చేయాల్సిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు ప్రతిపక్షంలో ఉండడంతో ఈ వేడుకలకు వారు దూరంగానే ఉన్నారు. దీంతో జీహెచ్ఎంసీ, రెవెన్యూ, జలమండలి, పోలీస్, ఎలక్ట్రిసిటీ ఇలా ఏ విభాగంలో కూడా స్వయంగా వేడుకలను నిర్వహించేందుకు ముందుకొచ్చే అధికారి ఎవరు? కూకట్‌పల్లిలో విజయోత్సవాలు ఉంటాయా? అనేది ఒకటి, రెండు రోజుల్లో తెలియనుంది.

ఘనంగా శ్రీవారి పవిత్రోత్సవాలు



అన్న సమారాధనలో భక్తులు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సర్దార్ పటేల్ నగర్‌లోని శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం సాయంత్రం ధాత్రీ కల్యాణం నిర్వహించారు. భక్తులు కల్యాణం తిలకించి అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు. అన్న సమారాధనకు వేలాది మంది భక్తజనం హాజరయ్యారు.

కూలిన స్తంభం



గాయత్రి నగర్‌లో కూలిన స్తంభం

అల్లాపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ గాయత్రీనగర్‌లో బుధవారం ఓ ఇంటి యజమాని చెట్ల కొమ్మలను తొలగిస్తుండగా అది కూలి విద్యుత్ స్తంభంపై పడడంతో స్తంభం నేలకొరిగింది. అల్లాపూర్ విద్యుత్ అధికారి ఏఈ రాకేష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇంటి యజమాని చెటు కొమ్మలను తొలగించేందుకు ప్రయత్నించాడు. చెట్టు కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో బరువుకు స్తంభం నేలకొరిగింది. ఇలా ఎవరుపడితే వారు చెట్ల జోలికి వెళ్లొద్దని ఏఈ హెచ్చరించారు. చెట్లను ఓ క్రమపద్ధతిలో ట్రిమింగ్ చేస్తామని, అందుకు తమకు తెలియజేయాలన్నారు. అతిక్రమణలకు పాల్పడే వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

కూకట్‌పల్లి, మూసాపేట్‌లో మందకొడిగా సర్వే

- జంట సర్కిళ్లకు సరిపడా సిబ్బంది లేక ఉన్నతాధికారులు సతమతం
- ప్రభుత్వ స్కూల్స్ టీచర్స్ సూపర్‌వైజర్ల నియామకం అంతా గందరగోళమే!
- సర్వేలో ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పలేని ఉద్యోగులు, ఎన్యుమరేటర్లు

సమగ్ర కుటుంబ సర్వేపై అధికార యంత్రాంగానికే స్పష్టత లేదు. శిక్షణలేని ఎన్యుమరేటర్లతో రోజురోజుకు సర్వే అభాసు పాలు చేస్తున్నారన్న విమర్శలు సర్వత్రా విన్పిస్తున్నాయి. ప్రజలకు ఉన్న సందేహాలను నివృత్తి చేయాల్సిన ఎన్యుమరేటర్లు తమకేమీ తెలియదని, బుక్‌లెట్ ఇచ్చి మీ వివరాలను నింపాలని చెబుతుండడంతో ఒక్కోచోట సర్వేకు వెళ్తున్న సిబ్బందిపై కస్సుమంటున్నారు.

కూకట్‌పల్లి, మూసాపేట్ జంట సర్కిళ్ల పరిధిలో ఏ రోజు ఎవరు విధుల్లోకి వస్తున్నారో తెలియకపోవడంతో జీహెచ్ఎంసీలో పనిచేసే ఉద్యోగులు తలలు పట్టుకుంటున్నారు. బస్తీల్లో అయితే ఓకే.. అపార్ట్‌మెంట్స్, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీల్లో సర్వేకు వెళ్తున్న ఉద్యోగులు, ఎన్యుమరేటర్లకు ప్రశ్నలతో ఉక్కిరి బిక్కిరి చేస్తూ తీరా సమాధానాలు చెబుతున్నారా అంటే అదీ లేదు!

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిళ్ల పరిధిలో సమగ్ర కుటుంబ సర్వే మందకొడిగా సాగుతుందని చెప్పొచ్చు. డీసీలు హరి కృష్ణయ్య, వంశీకృష్ణ చేస్తున్న సూచనలు అప్పటి వరకే పరిమితం అవుతున్నాయి. జడ్సీ అపూర్వ్ చౌహాన్ కూడా సర్వేలో పాల్గొంటున్నా ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు. మూసాపేట్ సర్కిల్‌లో 990, కూకట్‌పల్లి సర్కిల్‌లో 1030 బ్లాకులుగా విభజించి ప్రతి డివిజన్‌కు ఒక ఇన్‌చార్జిని నియమించారు. 10 మంది ఎమిరేటర్స్‌కు ఒక సూపర్ వైజర్‌ను నియమించి క్షేత్ర స్థాయిలో సమగ్ర కుటుంబ సర్వే చేసే పనికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ స్కూల్స్ నుంచి వచ్చిన ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోవడంలో జీహెచ్ఎంసీ అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



కేపీహెచ్‌బీ వార్డు కార్యాలయంలో సూపర్‌వైజర్‌లతో సమావేశమైన జీహెచ్ఎంసీ అధికారి

అవగాహన రాహిత్యం..

సోమవారం ఇచ్చిన చోట మంగళవారం లేదు.. మంగళవారం పనిచేసే వ్యక్తికి బుధవారం ప్రదేశం మార్చారు. ఇదంతా అవగాహన రాహిత్యం వల్లనే జరిగిందని, మాకు అప్పజెప్పిన పనిని మేము చేద్దామన్నా మా సేవలను వినియోగించుకునే వారే లేరని ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు తన అసహనాన్ని వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో 417 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో కేంద్రంలో 900 నుంచి 1400 కుటుంబాలు ఉన్నాయి. మూడు రోజుల్లో స్టిక్కరింగ్ పూర్తిచేయాల్సి ఉండగా.. ఐదు రోజుల తీసుకున్నారు. ఒక్కో ఎన్యుమరేటర్‌కు సమగ్ర కుటుంబ సర్వేలో ఇచ్చిన 150-170 కుటుంబాల సర్వే పూర్తి చేస్తే రూ.10వేలు గౌరవ వేతనం ఇస్తామని చెప్పారు. వారం రోజులు గడిచినా డివిజన్ ఇన్‌చార్జిలు, బ్లాక్ సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు కనీసం ఖర్చుల కింద రూపాయి కూడా ఇవ్వలేదనే సమాచారం. పని చేశాక అయినా ఇస్తారా అంటే అదీ ఖచ్చితంగా చెప్పలేని స్థితిలో ఉన్నారు అధికారులు. దీంతో క్షేత్రస్థాయిలో తాము మాటలు పడి తీరా ఆఫీసుకొస్తే చాయ్ కూడా ఇచ్చే నాథుడే లేరని ఓ ఎన్యుమరేటర్ తన ఆవేదన వ్యక్తం చేసి.. నేను మానేస్తున్నానని ఖరాఖండిగా చెప్పేసింది. ఇది కాస్త ఇతర డివిజన్లకు తెలియడంతో గత మూడు రోజులుగా రోజూ విధులకు హాజరవుతున్న వారిలో 60శాతం మించడం లేదు. కావాల్సినంత మందిని నియమించుకునేందుకు ఆయా డివిజన్ల పరిధిలో పనిచేసే ఉద్యోగులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అమ్మా.. మీకు మేమున్నాం.. కనీసం ఒక్కొక్కరు ఐదు మంది అయినా తీసుకురండి అని బ్రతిమిలాడుకోవడం వారివంతైందని చెప్పొచ్చు.

సమావేశాలతోనే సరి..

సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొనడం కంటే సమావేశాలతోనే సరిపోతుందని ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. డివిజన్, సర్కిల్, జోన్, హెడ్ఆఫీస్ అంటూ రోజుకు రెండు, మూడు సార్లు సమావేశాలు, వాట్సాప్ గ్రూప్‌ల్లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ అంటూ ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఎన్యుమరేటర్లకు ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు తీసుకుంటున్న చర్యలు ఏ మాత్రం కన్పించడం లేదు. సమస్యలు చెప్పండి పరిష్కరిస్తాం అంటూ నలుగురు అయిదుగురు అధికారులు హామీ ఇస్తున్నా సర్వేలో ప్రశ్నలు అడిగితే ఒక్కొక్కరు బూతులు తిట్టడం ఒక్కటే లేదు. కానీ మేము వెళ్తే మాత్రం మీరు అడిగినవి మేము ఎందుకు ఇవ్వాలి? ఇవ్వం ఏం చేస్తారంటూ ఎదురు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అన్నివిషయాలు ఎప్పటికప్పుడు జీహెచ్ఎంసీ అధికారులకు తెలియజేస్తున్నామని, మున్ముందు సర్వే సజావుగా సాగేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలని మూసాపేట్ సర్కిల్‌లో పనిచేస్తున్న ఓ అధికారి తెలిపారు.

భరోసా ఇస్తే ఉంటారు!

సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొనే ఉద్యోగులు, ఎన్యుమరేటర్లకు ఇచ్చే రెమ్యునరేషన్‌లో ఎంతో కొంత అడ్వాన్స్‌గా ఇస్తే కొంత మంది నిలబడతారని చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో జరిగే సర్వేలో పడుతున్న ఇబ్బందులను కూడా అధిగమిస్తున్న మహిళా ఎన్యుమరేటర్లకు అధికారులు మేమున్నామనే ధైర్యం ఇవ్వాలి. ఎన్నో అవమానాలు పడి సర్వే చేసినా గుర్తించే వారులేకపోవడంతో మేము ఇప్పటి వరకు పనిచేసిన దానికి ఒక్క రూపాయి ఇవ్వకున్నా మానేస్తున్నారు. బాగా పనిచేస్తున్న వారిని గుర్తించి ప్రోత్సహించడం, మంచి నీళ్లు, టీ వంటివి ఏర్పాటు చేయడం, ఎన్యుమరేటర్ల సమస్యలను అడిగి తెలుసుకొని వాటిని అధిగమించేందుకు మేము వస్తామని ఉన్నతాధికారులు చెబితే అంతకు మించిన ఆనందం తమకేమి ఉంటుందని ఎన్యుమరేటర్లు అంటున్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో కిలో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ.23, వంకాయ రూ.55, బెండకాయ రూ.45, పచ్చి మిర్చి రూ.28, బజ్జి మిర్చి రూ.65, కాకరకాయ రూ.32, బీరకాయ రూ.42, క్యాబేజీ రూ.35, బీన్స్ రూ.55, క్యారెట్ రూ.70, గోబి పువ్వు రూ.23, దొండకాయ రూ.32, చిక్కుడు కాయ రూ.70, గోరు చిక్కుడు రూ.50, బీట్ రూట్ రూ.55, క్యాప్సికం రూ.70, ఆలుగడ్డ రూ.37, కీర రూ.17, దోసకాయ రూ.35, సొరకాయ రూ.25, పొట్లకాయ రూ.23, కంద రూ.55, ఉల్లిపొరక రూ.55, ఉల్లిగడ్డ రూ.45, మామిడి కాయ రూ.15-20, అరటికాయ రూ.8-9, చామగడ్డ రూ.37, ముల్లంగి రూ.4-5, చిలగడ దుంప రూ.40, గుమ్మడికాయ రూ.30, నిమ్మకాయలు రూ.50-60, మునగ కాయలు రూ.8-10, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండు మిర్చి రూ.220, అల్లం రూ.160, వెల్లుల్లి రూ.380, చింతపండు రూ.140, పండు మిర్చి రూ.80, ఉసిరి రూ.40, కరివేపాకు రూ.70, పర్వల్ రూ.45, పల్లికాయ రూ.65, లోబా రూ.45, ఆ కాకరకాయ రూ.90. పైన పేర్కొన్న ధరలు శుక్రవారం ఉదయం 9.30గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అల్లాపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఎల్‌సీ నిర్వహణ పనుల కారణంగా గురువారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ రాకేష్ గౌడ్ తెలిపారు. 11 కేవీ పర్వత్‌నగర్ ఫీడర్ పరిధిలోని శ్రీ వివేకానంద నగర్, పర్వత్ నగర్, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియాల్లో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, 11 కేవీ అల్లాపూర్ ఫీడర్ పరిధిలోని గాయత్రీనగర్, జ్యోతినగర్, చంద్రా గార్డెన్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

నేరాల నియంత్రణకు ఆటో డ్రైవర్లు సహకరించాలి



బాలానగర్ నర్సాపూర్ చౌరస్తా ఆటో స్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు సూచనలు చేస్తున్న ఏసీపీ హనుమంతరావు



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు

బాలానగర్, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు ఆటోడ్రైవర్లు పోలీసులకు సహకరించాలని బాలానగర్ ఏసీపీ హనుమంతరావు అన్నారు. బుధవారం ఉదయం సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఆదేశాల మేరకు శోభనా బస్టాప్, నర్సాపూర్ కూడలి వద్ద నేరాలు, ఆటో డ్రైవర్ల ప్రమేయంపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బాలానగర్ సీఐ నర్సింహరాజు, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

హైదర్‌నగర్: కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు ఆటో స్టాండ్‌లను బుధవారం కూకట్‌పల్లి జోన్ ఏసీపీ కె.శ్రీనివాస్‌రావు సందర్శించారు. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ బస్టాప్, అడ్డగుట్ట, జేఎన్‌టీయూ రోడ్డు, మూసాపేటలోని పలు ఆటోస్టాండ్‌లను కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్లు కొత్తపల్లి ముత్తు, వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఏసీపీ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్లవల్ల జరిగిన సంఘటనలు దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆటో స్టాండ్‌లను సందర్శించి డ్రైవర్లకు పలు సూచనలు చేసినట్టు తెలిపారు. డ్రైవర్లు అందరూ నిబంధనలు పాటించాలని ఆదేశించారు. ప్రతి ఆటో స్టాండ్‌లో ఆటోలకు సంబంధించిన లిస్ట్, అదేవిధంగా డ్రైవర్ల లైసెన్స్ వంటి పత్రాలు సంబంధిత పోలీస్‌స్టేషన్లలో అందించాలని డ్రైవర్లకు, ఆటో యూనియన్ నాయకులకు తెలిపారు.

పోలీసుల సహకారంతో పనిచేయాలి



ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలతో మాట్లాడుతున్న సైబరాబాద్ స్పెషల్ బ్రాంచి డీసీపీ సాయిశ్రీ

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పోలీసుల సహకారంతో ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది పనిచేయాలని, స్థానికంగా ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సైబరాబాద్ స్పెషల్ బ్రాంచి డీసీపీ సాయిశ్రీ ప్రైవేట్ భద్రతా సంస్థల ప్రతినిధులకు సూచించారు. సైబరాబాద్ సీపీ కార్యాలయంలో బుధవారం ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో డీసీపీ సాయిశ్రీ మాట్లాడుతూ... నేరాలను అరికట్టేందుకు, సమాజాన్ని రక్షించేందుకు పోలీసులు చేస్తున్న ప్రయత్నాలకు మద్దతుగా ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. వృత్తి నైపుణ్యం, చట్టబద్ధమైన కార్యకలాపాల్లో ఉన్నత ప్రమాణాలను నిర్వహించేందుకు ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల చట్టాన్ని ఖచ్చితంగా పాటించాలన్నారు. సైబరాబాద్ పరిధిలో 355 లైసెన్స్ పొందిన ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలు పనిచేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో చట్టబద్ధంగా పనిచేయడానికి అన్ని ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలు తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇంటెలిజెన్స్ జారీ చేసిన లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సైబరాబాద్ సీఎస్‌డబ్ల్యూ ఏడీసీపీ శ్రీనివాసరావు, సీఎస్‌డబ్ల్యూ ఏడీసీపీ గిరిరాజు, వివిధ భద్రతా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఏసీపీ హనుమంతరావు, వేదికపై బాలానగర్ సీఐ నర్సింహరాజు తదితరులు

బాలానగర్, నవంబర్ 13(ఆంధ్రజ్యోతి): ఆలయాలు, ప్రార్థనా మందిరాలు, చర్చిల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి దొంగతనాలు జరుగకుండా కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని బాలానగర్ ఏసీపీ హనుమంతరావు సూచించారు. బుధవారం బాలానగర్ నర్సాపూర్ చౌరస్తాలోని సీబీటీడీలో ఏర్పాటు చేసిన రెలిజియస్ ప్లేసెస్ సెక్యూరిటీ అంశంపై ఆలయ, మసీద్, చర్చి కమిటీ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... మతాలు వేరైనా భారతీయులందరూ సమానమనే నినాదంతో విభేదాలు లేకుండా జీవించాలని అన్నారు. బాలానగర్ సీఐ నర్సింహ్మరాజు మాట్లాడుతూ... సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో నేరాలను అదుపు చేసేందుకే ప్రత్యేక సాంకేతికత అందుబాటులో ఉందన్నారు. బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న 86 ప్రార్థనా మందిరాల వద్ద పెట్రో మొబైల్స్ నిఘా ఉంచాయన్నారు. ప్రత్యేక యాప్‌ల ద్వారా భద్రతపై మరింత అవగాహన పెంచుకోవాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఆదర్శనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్, నవజీవన్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అరుణ్, డీఐ నాగిరెడ్డి, అడ్మిన్ ఎస్సై రామ్‌నారాయణ, ఎస్సైలు సుభాష్, మహ్మద్ హాజీ మియా, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో ఉన్నత విద్యపై సదస్సు



కార్యక్రమంలో పాల్ మార్షల్, గుల్నార్ స్టోవేర్ తదితరులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో పరిశ్రమ, విద్యారంగం స్పందించాల్సిన తీరుపై చర్చిస్తూ 'పర్యావరణ పరిరక్షణలో ఉన్నత విద్య, పరిశ్రమ, విశ్వవిద్యాలయాల భాగస్వామ్యం' అంశంపై ఓ కార్యక్రమాన్ని రాయదుర్గంలోని టీ-హబ్ వద్ద బుధవారం నిర్వహించారు. యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్ లండన్ (యూఈఎల్), సిమెన్స్, టీ-హబ్‌లు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూఈఎల్ వైస్ ప్రెసిడెంట్(గ్లోబల్ క్యాంపస్) ప్రొఫెసర్ పాల్ మార్షల్, డైరెక్టర్ గుల్నార్ స్టోవేర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పరిశ్రమ, విద్యారంగ భాగస్వామ్యాలను నిర్మించడంలో సవాళ్లు, అవకాశాలపై చర్చించారు. విశ్వవిద్యాలయాలు హరిత ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో తమ పాఠ్యాంశాలను ఎలా సమలేఖనం చేయవచ్చనే అంశాలను చర్చించారు. పర్యావరణ పరిరక్షణ నాయకులను తీర్చిదిద్దడంలో ఉన్నత విద్య పాత్రను వక్తలు ప్రముఖంగా ప్రస్తావించారు. దీనిలో భాగంగా సిమెన్స్‌తో యూఈఎల్ ఒప్పందం కూడా చేసుకుంది. యూఈఎల్ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణకు పరిశ్రమ అనుభవం పొందేందుకు ఈ భాగస్వామ్యం తోడ్పడనుందని పాల్ మార్షల్ అన్నారు. భారతదేశపు ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసేందుకు తాము కట్టుబడి ఉన్నామని ఆయన చెబుతూ 2030 నాటికి నికర సున్నా ఉద్గారాలను లక్ష్యంతో తాము ముందుకు వెళ్తున్నామన్నారు. సీమెన్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ విభాగం వైస్ ప్రెసిడెంట్ ఫేయ్ బౌసర్ మాట్లాడుతూ ఉన్నత విద్యాసంస్థల భాగస్వామ్యంతో పర్యావరణ అనుకూలత గురించి తాము విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోరా?

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ మూడోఫేజ్‌లోని ఎంఐజీ బ్లాక్ నంబర్ 92లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారని జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యా దు చేసినా చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆర్టీఏ యాక్ట్ ద్వారా సమాచారం సేకరించి కోర్టును ఆశ్రయించగా.. అది పూర్తిగా అక్రమ నిర్మాణమని చెప్పినా.. ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బుధవారం మరోసారి మూసాపేట్ సర్కిల్ అధికారులకు రాతపూర్వకంగా తెలియజేశారు. గతంలో ఇచ్చిన ఆర్టీఏ, కోర్టు ఇచ్చిన కాపీలను కూడా అధికారులకు ఇచ్చామన్నారు. సదరు నిర్మాణంపై చర్యలు తీసుకోకపోతే కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని, చుట్టుపక్కల, పరిసర ప్రాంతాల నుంచి తాము సంతకాలతో ఫిర్యాదు చేసినా టౌన్‌ప్లానింగ్ అధికారుల్లో ఎలాంటి చలనం ఉండడం లేదని పేర్కొన్నారు.

కత్తితో బెదిరించి స్నాచింగ్‌లు : ఇద్దరు మైనర్ల అరెస్టు

- ఐమాక్స్ వద్ద న్యాయవాదిపై దాడి చేసింది వీరే..



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ చంద్రశేఖర్

మంగళ్‌హాట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఐమాక్స్ వద్ద న్యాయవాది కల్యాణ్‌పై దాడి చేసి మొబైల్ ఫోన్ ఎత్తుకెళ్లిన కేసును పోలీసులు ఛేదించి ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. బుధవారం ఆబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ ఆకుల చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు గన్‌ఫౌండ్రిలోని ప్రసాద్ అపార్ట్‌మెంట్ వద్ద వాచ్‌మెన్‌ను ఇద్దరు కత్తితో బెదిరించి మొబైల్ ఫోన్‌ను లాక్కెళ్లారు. అక్కడి నుంచి వారు వచ్చిన హోండా యాక్టివాపై ఐమాక్స్ వద్దకు వెళ్లారు. అక్కడ వాకింగ్ చేస్తున్న న్యాయవాది కల్యాణ్ వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌ను దొంగిలించేందుకు యత్నించారు. ఆయన ప్రతిఘటించడంతో వారి వెంట తెచ్చుకున్న కత్తితో బెదిరించారు. ఈ పెనుగులాటలో న్యాయవాది కల్యాణ్‌కు గాయాలయ్యాయన్నారు. సెంట్రల్ జోన్ పరిధిలో ఇదే తరహాలో రెండు కేసులు నమోదు కావడంతో డీసీపీ నేతృత్వంలో రెండు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా రాంనగర్ చేపల మార్కెట్ వద్ద ఓ మైనర్‌ను అదుపులోకి తీసుకుని అతడి వద్ద దొంగిలించిన రెడ్‌మీ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనిచ్చిన సమాచారం మేరకు చాంద్రాయణగుట్ట బండ్లగూడ వద్ద మరో మైనర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు.

అతడి వద్ద న్యాయవాది కల్యాణ్ నుంచి దొంగిలించిన మొబైల్ ఫోన్, దాడికి ఉపయోగించిన కత్తి, హోండా యాక్టివాను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారి ఆధార్ కార్డుల ఆధారంగా వారు మైనర్లు అని తేలిందని, వారి వయసును నిర్ధారించేందుకు ఉస్మానియా ఆస్పత్రిలో టెస్టుల కోసం పంపించా మన్నారు. గతంలో వారిపై ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో మొబైల్ స్నాచింగ్ కేసు నమోదైందన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించిన అనంతరం కస్టడీకి తీసుకుని విచారిస్తామని ఏసీపీ చంద్రశేఖర్ తెలిపారు.

రూ.7.17కోట్ల విలువగల డ్రగ్స్ ధ్వంసం

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రూ.7.17కోట్ల విలువ చేసే 2,380 కిలోల నార్కోటిక్ డ్రగ్స్‌ను పోలీసులు ధ్వంసం చేశారు. తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య, సైబరాబాద్ సీపీ అవినాష్ మొహంతి పర్యవేక్షణలో సైబరాబాద్ పోలీసుల డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఈ డ్రగ్స్‌ను పూర్తిగా ధ్వంసం చేసింది. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం ఈదులపల్లి గ్రామంలోని జీజే మల్టీక్లేవ్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉన్న కామన్ బయో-మెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్‌లో డ్రగ్స్ డిస్పోజల్ ఫెసిలిటీ ఉండడంతో అక్కడే చేపట్టారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని 31 పోలీస్ స్టేషన్ల పరిధిలో బాలానగర్, మాదాపూర్, మేడ్చల్, రాజేంద్రనగర్, శంషాబాద్‌లోని ఐదు జోన్లలో ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదైన 155 కేసులలో 2,380 కిలోల నార్కోటిక్ డ్రగ్స్ లభ్యమైంది. ఇందులో గంజాయి 2,286కిలోలు, గంజాయి చాక్లెట్లు 45 కిలోలు, హషీష్ ఆయిల్ 8 లీటర్లు, చరస్ 26కిలోలు, ఆల్ప్రాజోలం 10కిలోలు, నల్లమందు గసగసాలు 1.64 కిలోలు, ఎల్ఎస్‌డీ బ్లాట్స్ 8 యూనిట్లు ఇలా ఎండీఎంఏ, కొకైన్, గంజాయి పొడి, గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నారు. దీన్ని పూర్తిగా ధ్వంసం చేసే ప్రక్రియలో డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, డీసీపీ క్రైమ్స్ కె. నరసింహ, ఏసీపీ సైబర్ క్రైమ్స్ రవీందర్ రెడ్డి, సీసీఆర్‌బీ ఏసీపీ కళింగరావు, నార్కోటిక్స్ అదనపు డీసీపీ జి.నర్సింహారెడ్డి వారి బృందం ఉన్నది.

మేయర్‌పై తప్పుడు ప్రచారం..

- వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదైంది. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12 ఎన్‌బీటీనగర్‌కు చెందిన వెంకట్‌రెడ్డి ఇంటి నిర్మాణం చేస్తుండగా జీహెచ్ఎంసీ కూల్చివేసింది. ఈ వ్యవహారంపై కె.కేశవరావు, మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో పాటు ఆమె పీఏ రవిపై అవినీతి ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. కేకే, మేయర్ తరఫున వారి ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు వెంకట్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెషీన్‌లో పడి కార్మికుడి మృతి

జీడిమెట్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు యంత్రంలో పడి ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బిహార్ రాష్ట్రానికి చెందిన శివశంకర్‌పాశ్వాన్ (33) బతుకు దెరువు కోసం నగరానికొచ్చి దూలపల్లి గ్రామంలో నివాసముంటున్నాడు. రామిరెడ్డినగర్ ప్రాంతంలో ఉన్న గోవర్ధన అట్టలకంపెనీలో మెషిన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో పనిచేస్తుండగా యంత్రంలో పడి మృతి చెందాడు. మృతునికి భార్య పిల్లలు ఉన్నారు. పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసుదర్యాప్తు చేస్తున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు.

'రిటైర్డ్'.. గెట్ టు గెదర్!

- సందడి చేసిన జేఎన్‌టీయూ మాజీ ఉద్యోగులు



యూజీసీ ఆడిటోరియంలో జరిగిన గెట్ టు గెదర్‌లో వర్సిటీ మాజీ ఉద్యోగులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో సుదీర్ఘ కాలం పాటు సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన పలువురు మాజీ ఉద్యోగులు బుధవారం సమావేశమయ్యారు. వర్సిటీలోని యూజీసీ ఆడిటోరియంలో నిర్వహించిన గెట్ టు గెదర్ కార్యక్రమంలో పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అటెండరు నుంచి జాయింట్ రిజిస్ట్రార్ వరకు వివిధ హోదాల్లో పనిచేసిన ఉద్యోగులందరూ తారతమ్య బేధాలు మరిచి కాసేపు సందడి చేశారు. ఆపై రిటైర్డు ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించుకున్నారు. పెన్షన్ కోసం లైఫ్ సర్టిఫికెట్ల సమర్పణ, వర్సిటీలో మెడికల్ బిల్లుల పెండింగ్ తదితర అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. కార్యక్రమంలో చంద్రశేఖర్, రామశేఖర్, నాగమణి, నాగరాజు, రవికుమార్, సుబ్రమణ్యం, గాయత్రి, ఉషా, పద్మ, వెంకటరెడ్డి, జక్రయ్య పాల్గొన్నారు.

అయ్యప్ప మహా పడిపూజ

హైదర్‌నగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ శుభోదయ కాలనీలో దాసరి రాహుల్ ప్రదీప్ గురుస్వామి ఆధ్వర్యంలో బుధవారం అయ్యప్ప మహా పడిపూజ నిర్వహించారు. ఈ పడి పూజలో పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప మాలాధారణ భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాసరావు హరికృష్ణ గురుస్వామి, క్రాంతి, గురుచరణ్, కాంగ్రెస్ నాయకులు రాజేంద్ర పటేల్, పసునూరి రమేష్, కొండా విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


హుడా ట్రేడ్‌సెంటర్‌లో రోడ్డును పరిశీలిస్తున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్

రోడ్డు పనులను పూర్తిచేయాలి

గచ్చిబౌలి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని హుడా ట్రేడ్‌సెంటర్ కాలనీలో సీసీరోడ్డు వేసేందుకు పనులు ప్రారంభించారు. అందుకోసం ఉన్న రోడ్డును తవ్వి నెలలు గడుస్తున్నా మధ్యలో వదిలివేయడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని స్థానికులు బీజేపీ నాయకులు రవికుమార్‌యాదవ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన బుధవారం రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్న రోడ్డును తవ్వి వదిలేయడంతో కనీసం నడవలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజలకు ఆటంకంగా మారిన రోడ్డు నిర్మాణం వెంటనే పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే పరిస్థితి ఈ విధంగా మారిందన్నారు. దీనిపై అధికారులతో ఆయన ఫోన్‌లో మాట్లాడి రోడ్డు పనులు పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజుయాదవ్, నాగరాజు, పాశం రాజు, చిన్నబాబు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


సీసీరోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

సీసీరోడ్డు పనుల పరిశీలన

హైదర్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శంషీగూడలో జరుగుతున్న సీసీరోడ్ల పనులను బుధవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డును నాణ్యతా ప్రమాణాలతో నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు. అనంతరం కాలనీలో పర్యటించి స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రాధాన్యం క్రమంలో సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

రూ.7.17 కోట్ల విలువైన డ్రగ్స్ ధ్వంసం

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రూ.7.17కోట్ల విలువ చేసే 2,380 కిలోల నార్కోటిక్ డ్రగ్స్‌ను పోలీసులు ధ్వంసం చేశారు. తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య, సైబరాబాద్ సీపీ అవినాష్ మొహంతి పర్యవేక్షణలో సైబరాబాద్ పోలీసుల డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఈ డ్రగ్స్‌ను పూర్తిగా ధ్వంసం చేసింది. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం ఈదులపల్లి గ్రామంలోని జీజే మల్టీక్లేవ్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉన్న కామన్ బయో-మెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్‌లో డ్రగ్స్ డిస్పోజల్ ఫెసిలిటీ ఉండడంతో అక్కడే చేపట్టారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని 31 పోలీస్ స్టేషన్ల పరిధిలో బాలానగర్, మాదాపూర్, మేడ్చల్, రాజేంద్రనగర్, శంషాబాద్‌లోని ఐదు జోన్లలో ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదైన 155 కేసులలో 2,380 కిలోల నార్కోటిక్ డ్రగ్స్ లభ్యమైంది. ఇందులో గంజాయి 2,286కిలోలు, గంజాయి చాక్లెట్లు 45 కిలోలు, హషీష్ ఆయిల్ 8 లీటర్లు, చరస్ 26కిలోలు, అల్ప్రాజోలం 10కిలోలు, నల్లమందు గసగసాలు 1.64 కిలోలు, ఎల్‌ఎస్‌డీ బ్లాట్స్ 8 యూనిట్లు ఇలా ఎండీఎంఏ, కొకైన్, గంజాయి పొడి, గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నారు. దీన్ని పూర్తిగా ధ్వంసం చేసే ప్రక్రియలో డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, డీసీపీ క్రైమ్స్ కె. నరసింహ, ఏసీపీ సైబర్ క్రైమ్స్ రవీందర్ రెడ్డి, సీసీఆర్‌బీ ఏసీపీ కళింగరావు, నార్కోటిక్స్ అదనపు డీసీపీ జి. నర్సింహారెడ్డి వారి బృందం ఉన్నది.

మేయర్‌పై తప్పుడు ప్రచారం.. వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న వ్యక్తి పై క్రిమినల్ కేసు నమోదైంది. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12 ఎన్‌బీటీనగర్‌కు చెందిన వెంకట్‌రెడ్డి ఇంటి నిర్మాణం చేస్తుండగా జీహెచ్‌ఎంసీ కూల్చివేసింది. ఈ వ్యవహారంపై కె.కేశవరావు, మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో పాటు ఆమె పీఏ రవిపై అవినీతి ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. కేకే, మేయర్ తరఫున వారి ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు వెంకట్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

చందానగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్పా ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న సెంటర్‌పై పోలీసులు దాడిచేసిన సంఘటన చందానగర్ పీఎస్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేముకుంట ప్రధాన రహదారిలో న్యూ డ్రీమ్ స్పా అండ్ సెలూన్‌లో స్పా ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్నారని సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడులో ఇద్దరు యువకులను, నిర్వాహకుడిని అరెస్టు చేశారు.

చందానగర్‌లో మహిళ అదృశ్యం


అంకిత

చందానగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యమైన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన శ్రీను జీవనోపాధి కోసం నగరానికి వచ్చి చందానగర్ శివాజీనగర్‌లో భార్య అంకితతో కలిసి ఉంటున్నాడు. శ్రీను కూలీపని చేస్తుంటాడు. అంకిత(20) హౌస్‌కీపింగ్ పనిచేస్తుంది. ఈనెల 11న శ్రీను పనికోసం ఇంటి నుంచి వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చే సరికి అంకిత ఇంటి దగ్గర లేదు. దీంతో ఆమె పనిచేస్తున్న చోట విచారిస్తే రాలేదని చెప్పారు. బంధువులు, స్నేహితులను విచారించినా ఆచూకీ లభించలేదు. దీంతో భర్త చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు యంత్రంలో పడి కార్మికుడి మృతి

జీడిమెట్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు యంత్రంలో పడి ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన శివశంకర్‌పాశ్వాన్(33) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి దూలపల్లి గ్రామంలో నివాసముంటున్నాడు. రామిరెడ్డినగర్ ప్రాంతంలో ఉన్న గోవర్ధన అట్టలకంపెనీలో మెషిన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో పని చేస్తుండగా యంత్రంలో పడి మృతి చెందాడు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు.

రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా..

గుంతల రోడ్లపై వెళ్లేందుకు భయపడుతున్న వాహనదారులు





మంజీర రోడ్డు, ఎంఏనగర్‌లో గుంతలమయంగా రోడ్డు

మియాపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో రోడ్లు గుంతలమయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో కంకర తేలడంతో ప్రయాణించేందుకు వాహనదారులు జంకుతున్నారు. మియాపూర్, ఎంఏనగర్, ప్రశాంత్‌నగర్, దీప్తిశ్రీనగర్, హఫీజ్‌పేట, ప్రేంనగర్, మంజీర పైపులైను రోడ్డుతోపాటు పలు ప్రాంతాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు గుంతలమయంగా మారాయి.

దీంతో రాకపోకలు సాగించాలంటే స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో గుంతలు కనిపించక ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయాలకు గుర వుతు న్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


జి.ధనుంజయ్ (ఫైల్)

కుషాయిగూడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సివిల్ కాంట్రాక్టు పనిలో వచ్చిన నష్టాలకు తోడు, ఆన్‌లైన్ బెట్టింగ్ ద్వారా డబ్బులు పోగొట్టుకొని అప్పుల పాలైన ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చర్లపల్లి ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అనిత తన ఇద్దరు కుమారులతో కలిసి మల్లాపూర్‌లోని నెహ్రూనగర్‌లో నివసిస్తోంది. తన భర్త కుమారస్వామి ఇటీవల మరణించడంతో భర్తకు సంబంధించిన సివిల్ కాంట్రాక్టు పనులన్నీ చిన్న కుమారుడు గొడ్డెల ధనుంజయ్ చూసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడ్డ ధనుంజయ్ భారీ మొత్తంలో నష్టపోయి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. మంగళవారం ఉదయం అతడు నిద్రిస్తున్న గది తలుపులు ఎంతకీ తెరవకపోవడంతో ఇరుగు పొరుగు వారి సహాయంతో బద్దలు కొట్టారు. ఇనుప రాడ్డుకు బెడ్‌షీట్‌తో ఉరేసుకున్న ధనుంజయ్ మృతదేహాన్ని కిందకు దించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పరిశోధనల్లో విద్యావేత్తల కృషి అభినందనీయం

హెచ్‌సీయూను సందర్శించిన కేంద్రమంత్రి సుకాంత్ మజుందార్


రీసెర్చ్ స్కాలర్‌తో సంభాషిస్తున్న కేంద్రమంత్రి సుకాంత్, చిత్రంలో వర్సిటీ వీసీ బీజేరావు తదితరులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పరిశోధనల్లో విద్యావేత్తల కృషి అభినందనీయం అని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుకాంత్ మజుందార్ అన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. కేంద్రమంత్రికి వర్సిటీ వీసీ బీజేరావు, రిజిస్ట్రార్ దేవేష్ నిగమ్ సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులు, ఆచార్యులతో కేంద్రమంత్రి సంభాషిస్తూ.. దేశ భవిష్యత్ రూపకల్పనలో నాణ్యమైన విద్య, ఆవిష్కరణలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. పరిశోధనల్లో విద్యావేత్తల కృషి, కమ్యూనిటీ ఔట్‌రీచ్‌లో శ్రేష్ఠతను సాధించడంలో విశ్వవిద్యాలయం పనితీరును ఆయన ప్రశంసించారు. యూనివర్సిటీ విజన్‌కు అనుగుణంగా విద్య, నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాలపై కూడా మంత్రి చర్చించారు. లైఫ్ సైన్సెస్ విభాగంలోని యాస్పైర్ బయోనెస్ట్(నాలెడ్జ్ బేస్డ్ ఇంక్యుబేటర్)ను సందర్శించిన మంత్రి అక్కడి స్టార్టప్‌ల అభివృద్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' ప్రచారంలో భాగంగా క్యాంపస్‌లో ఒక మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాల ఉన్నతాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గెట్ టు గెదర్

సందడి చేసిన జేఎన్‌టీయూ మాజీ ఉద్యోగులు


యూజీసీ ఆడిటోరియంలో 'గెట్ టు గెదర్'లో పాల్గొన్న వర్సిటీ మాజీ ఉద్యోగులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో సుదీర్ఘకాలం పాటు సేవలందించి పదవీవిరమణ చేసిన పలువురు మాజీ ఉద్యోగులు బుధవారం సమావేశమయ్యారు. వర్సిటీలోని యూజీసీ ఆడిటోరియంలో నిర్వహించిన గెట్ టు గెదర్ కార్యక్రమంలో ఒకర్ని ఒకరు కలుసుకొని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అటెండరు నుంచి జాయింట్ రిజిస్ట్రార్ వరకు వివిధ హోదాల్లో పనిచేసిన ఉద్యోగులంతా తరతమ భేదాలు మరిచి కాసేపు సందడి చేశారు. ఆపై రిటైర్డు ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పైనా చర్చించుకున్నారు. పెన్షన్ కోసం లైఫ్ సర్టిఫికెట్ల సమర్పణ, వర్సిటీలో మెడికల్ బిల్లుల పెండింగ్ తదితర అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. కార్యక్రమంలో చంద్రశేఖర్, రామశేఖర్, నాగమణి, నాగరాజు, రవికుమార్, సుబ్రమణ్యం, గాయత్రి, ఉష, పద్మ, వెంకటరెడ్డి, జక్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో ఉన్నత విద్యపై సదస్సు

టీ-హబ్‌తో ఒప్పందం చేసుకున్న యూఈఎల్


సదస్సులో పాల్గొన్న యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్ లండన్, సిమెన్స్, టీ-హబ్ ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో పరిశ్రమ, విద్యారంగం స్పందించాల్సిన తీరుపై చర్చిస్తూ 'పర్యావరణ పరిరక్షణలో ఉన్నత విద్య : పరిశ్రమ, విశ్వవిద్యాలయాల భాగస్వామ్యం' అంశంపై ఓ కార్యక్రమాన్ని రాయదుర్గంలోని టీ-హబ్ వద్ద బుధవారం నిర్వహించారు. యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్ లండన్ (యూఈఎల్), సిమెన్స్ టీ-హబ్‌లు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూఈఎల్ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ క్యాంపస్) ప్రొఫెసర్ పాల్ మార్షల్, డైరెక్టర్ గుల్నార్ స్టోవేర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పరిశ్రమ, విద్యారంగ భాగస్వామ్యాలను నిర్మించడంలో సవాళ్లు, అవకాశాలపై చర్చించారు. విశ్వవిద్యాలయాలు హరిత ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో తమ పాఠ్యాంశాలను ఎలా సమలేఖనం చేయవచ్చనే అంశాలను చర్చించారు. పర్యావరణ పరిరక్షణ నాయకులను తీర్చిదిద్దడంలో ఉన్నత విద్య పాత్రను వక్తలు ప్రముఖంగా ప్రస్తావించారు. దీనిలో భాగంగా సిమెన్స్‌తో యూఈఎల్ ఒప్పందం కూడా చేసుకుంది. యూఈఎల్ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ పరంగా పరిశ్రమ అనుభవం పొందేందుకు ఈ భాగస్వామ్యం తోడ్పడనుందని పాల్ మార్షల్ అన్నారు. భారతదేశపు ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసేందుకు తాము కట్టుబడి ఉన్నామని ఆయన చెబుతూ 2030 నాటికి నికర సున్నా ఉద్గారాలను లక్ష్యంతో తాము ముందుకు వెళ్తున్నామన్నారు. సీమెన్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ విభాగం వైస్ ప్రెసిడెంట్ ఫేయ్ బౌసర్ మాట్లాడుతూ ఉన్నత విద్యాసంస్థల భాగస్వామ్యంతో పర్యావరణ అనుకూలత గురించి తాము విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు.


ఎమ్మెల్యే గాంధీకి కాలనీ సమస్యలు వివరిస్తున్న కాలనీవాసులు

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

హైదర్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ రాంనరేష్‌నగర్ కాలనీ వాసులు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై బుధవారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ త్వరలో కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు పోతుల రాజేందర్, వెంకటేష్ యాదవ్, సత్యనారాయణ, రవి, బ్రహ్మయ్య, మహేందర్‌రెడ్డి, మురళి, బుజంగం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

హైదర్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ డివిజన్ ప్రేమ్‌నగర్ బి-బ్లాక్‌కు చెందిన పద్మగౌడ్ వైద్యచికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకుంది. దీంతో ఆమెకు మంజూరైన రూ.51వేల చెక్కును బుధవారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు జిల్లా గణేష్, ప్రసాద్, సత్యంగౌడ్, యాదగిరిగౌడ్, రవిశంకర్ పాల్గొన్నారు.


ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

హైదర్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పలు ఆటో స్టాండ్‌లను బుధవారం కూకట్‌పల్లి జోన్ ఏసీపీ కె.శ్రీనివాస్‌రావు సందర్శించారు. కూకట్‌పల్లి బస్‌స్టాండ్, కేపీహెచ్‌బీ బస్‌స్టాప్, అడ్డగుట్ట, జేఎన్‌టీయూ రోడ్, మూసాపేటలో ఉన్న పలు ఆటోస్టాండ్‌లను కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్లు కొత్తపల్లి ముత్తు, వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్ల వల్ల జరిగిన సంఘటనలు దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆటో స్టాండ్‌లను సందర్శించి డ్రైవర్‌లకు పలు సూచనలు చేశామన్నారు. డ్రైవర్లు అందరూ నిబంధనలు పాటించాలని ఆదేశించారు. ఆటో స్టాండ్‌లో నిలిపివుంచే అన్ని ఆటోలకు సంబంధించిన లిస్ట్, అదేవిధంగా డ్రైవర్ల లైసెన్స్ వంటి పత్రాలు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లలో అందించాలని డ్రైవర్లకు, ఆటో యూనియన్ నాయకులకు తెలిపారు.


సర్వే అధికారులకు వివరాలు చెబుతున్న కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

సర్వేకు సహకరించాలి : కార్పొరేటర్

మియాపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా బుధవారం మియాపూర్ నాగార్జున ఎన్‌క్లేవ్‌లోని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ నివాసంలో అధికారులు ఆయన కుటుంబ వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ సమగ్ర కులగణన ద్వారా బడుగు బలహీన వర్గాలు, వెనుకబడిన వర్గాల జాబితా సిద్ధంచేసి అభివృద్ధి ఫలాలు అందరికీ అందేలా మంచి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలు సర్వేకు వచ్చే అధికారులు, సిబ్బందికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు వైద్యాధికారి రవి, శానిటేషన్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఎస్‌ఆర్‌పీ కనకరాజు, ఎస్‌ఎఫ్‌ఐలు వినయ్, అగమ్య తదితరులు పాల్గొన్నారు.

శాంతి సరోవర్‌లో పరివర్తన కార్యక్రమం

రాయదుర్గం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో అసఫ్ జాహీ రాజవంశానికి చెందిన 9వ నిజాం రౌనక్ యార్‌ఖాన్ యాన్ ఈవెనింగ్ ఆన్ స్ట్రెస్ డిటాక్స్ పేరుతో పరివర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యూఢిల్లీ నుంచి ప్రేరణాత్మక నాయకురాలు ఆశా దీదీ ప్రత్యేక సందేశం అందించారు. ఒత్తిడి బహుముఖ స్వభావం కలిగి ఉంటుందని, శారీరక, మానసిక, భావోద్వేగ పరిణామాలను కలిగి ఉంటుందని అన్నారు. ఒత్తిడి అనేది విశ్వవ్యాప్తమని దీదీ పేర్కొన్నారు. ధ్యానం స్వీకరించడం, సానుకుల ఆలోచనను పెంపొందించడం ద్వారా మన జీవితంలోని అడ్డంకులను నావిగేట్ చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో శాంతి సరోవర్ డైరెక్టర్ బీకేసెంటర్స్, హైదరాబాద్ ఇన్‌చార్జి అజయ్‌మిశ్రా, బ్రహ్మకుమారీస్ ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మియాపూర్‌లో మిస్సింగ్.. పెద్దాపురంలో ప్రత్యక్షం

- మాయమాటలు చెప్పి తీసుకువచ్చిన యువకుడు
- అద్దె ఇంట్లో బాలికను నిర్బంధించి..
- అర్ధరాత్రి రక్షించిన పోలీసులు


బాలికను తీసుకొచ్చిన యువకుడు


కాకినాడ జిల్లా పెద్దాపురంలో బాలిక నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

> పదేళ్ల బాలికను బలవంతంగా తీసుకువచ్చి స్థానికంగా ఓ ఇంట్లో నిర్బంధించిన సంఘటన కాకినాడ జిల్లా పెద్దాపురంలోని పరదేశమ్మ కాలనీలో జరిగింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వి.మౌనిక తన సిబ్బందితో చేరుకుని బాలికను నిర్బంధించిన ఇంటి తలుపులు బద్దలుకొట్టి బాలికను కాపాడారు.

పెద్దాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా జడ్డంగి గ్రామానికి చెందిన కొత్త ఆనంద్ హైదరాబాద్ నగరంలో మియాపూర్ ప్రాంతంలోని ఓ కార్పొరేట్ విద్యాసంస్థలో పనిచేస్తున్నాడు. సమీప ఇంటిలో నివాసముంటున్న ఓ పదేళ్ల బాలికకు మాయమాటలు చెప్పి లోబరుచుకున్నాడు. ఆ బాలికను పెద్దాపురం పట్టణానికి మంగళవారం రాత్రి తీసుకువచ్చి ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నిర్బంధించాడు. పెద్దాపురంలో బాలిక, ఆ యువకుడు ఎక్కిన ఆటో డ్రైవర్‌కు వారి ప్రవర్తనపై అనుమానం వచ్చి పెద్దాపురం పోలీసులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ మౌనిక తన సిబ్బందితో అక్కడకు చేరుకుని, ఇంటి తలుపులు బద్దలు కొట్టి బాలికను రక్షించారు. అనంతరం ఘటనా స్థలానికి చేరుకున్న పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు బాలిక నుంచి వివరాలను సేకరించారు. బాలిక తల్లిదండ్రులు కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో నివాసం ఉండేవారని, పొట్టకూటికోసం మియాపూర్‌లో ఓ ప్రైవేటు కళాశాలలో పనిచేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. అలాగే మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో బాలిక కిడ్నాప్‌పై మిస్సింగ్ కేసు నమోదైనట్టు తెలుసుకున్నారు. బాలికను యువకుడు ఇంట్లో నిర్బంధిస్తే ఇల్లు అద్దెకు ఇచ్చినవారికి తెలియలేదా అని వారిపై డీఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలికను, యువకుడిని స్టేషన్‌కు తరలించి వివరాలను సేకరించారు. బాలిక బంధువులకు సమాచారం తెలియజేశారు.

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

● నిజాం కళాశాల స్నాతకోత్సవంలో హెచ్‌సీయూ వీసీ బీజే రావు



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న అతిథులు

రవీంద్రభారతి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైపుణ్యాలను కలిగినప్పుడే అవకాశాలను అందుకోగలరని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బాసుత్కర్ జగదీశ్వర్‌రావు అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో నిజాం కాలేజీ స్నాతకోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన విద్యార్థులకు డిగ్రీ పట్టాలు, గోల్డ్‌మెడల్స్ ప్రదానం చేసి మాట్లాడారు. అవకాశాలను అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యను అందించిన విద్యా సంస్థలను, తమ ప్రాంతాన్ని, తల్లిదండ్రులను మర్చిపోవద్దన్నారు. విశిష్ట అతిథి ఉస్మానియా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ మొలుగారం కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులే భావి భారత నాయకులని, దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు. వివిధ రంగాల్లో నిజాం కాలేజీ పాత్ర చెప్పకోదగినదన్నారు. నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బీమా మాట్లాడుతూ.. మారుతున్న కాలానుగుణంగా వివిధ కోర్సులను ప్రవేశపెడుతూ విద్యార్థులకు ఉత్తమమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. కళాశాల ప్రగతి నివేదికను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా వివిధకోర్సుల్లో మెరిట్‌సాధించిన 49మంది విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్, 520 మందికి డిగ్రీ పట్టాలు అందజేశారు. ఓయూ ఎగ్జామ్స్ కంట్రోలర్ డా.చాంద్‌పాషా, వైస్ ప్రిన్సిపాల్ జి.ఉపేందర్, డా.పసునూతి మనోహర్, డా.ఆవుల ఏడుకొండలు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

అంధులలో అక్షరజ్యోతిని వెలిగించిన గొప్ప వ్యక్తి

వాలెంటిన్ హాయ్

● ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

జీడిమెట్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సుభాష్‌నగర్ డివిజన్‌లోని లూయిస్ బ్రెయిలీ భవన్‌లో వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్డ్ ఆధ్వర్యంలో 'వాలెంటిన్ హాయ్' జయంతి వేడుకలు నిర్వహించారు. అంధులలో అక్షర జ్యోతిని వెలిగించిన గొప్ప సంఘసంస్కర్త వాలెంటిన్ హాయ్ అని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో అంధుల పట్ల జరుగుతున్న వివక్షతకు చలించి, వారికోసం 1784లో ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా అంధ పాఠశాల ఏర్పాటు చేసిన సంఘసంస్కర్త అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, మన్నెరాజు, దూదిమెట్ల సోమేష్ యాదవ్, శ్రీకాంత్, వెంకటసాయి, గుబ్బల లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.


వాలంటిన్ హాయ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

టెక్ మహేంద్ర యూనివర్సిటీలో ర్యాగింగ్

దుండిగల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని టెక్ మహేంద్ర యూనివర్సిటీలో ర్యాగింగ్ కలకలం రేపింది. బీబీఏ జర్నలిజం మొదటి సంవత్సరం చదువుతున్న దినేష్ పాల్వంచ అనే విద్యార్థి తరగతిలో ఓ యువతి తనకు మర్యాద ఇవ్వడం లేదనే కారణంతో యువతి చెంప మీద చెళ్లుమనిపించాడు. దీంతో ఒక్కసారిగా తోటి విద్యార్థులు ఉలిక్కిపడ్డారు. యువకుడిపై బాధితురాలు దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కానీ దుండిగల్ సీఐ మాత్రం ఫిర్యాదులో రాగింగ్ కాదని, ఇద్దరు మొదటి సంవత్సరం విద్యార్థులేనని పేర్కొన్నారన్నారు.

ఒక్కో అంతస్తుకు ఒక్కో రేటు

● అక్రమాలకు అడ్డాగా మహదేవపురం ● పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు

గాజులరామారం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా యథేచ్ఛగా అక్రమ అంతస్తులు వెలుస్తుంటే వాటిని అరికట్టాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. కాసులకు కక్కుర్తిపడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, లక్షల రూపాయలు దండుకొని నిమ్మకుంటున్నారని పలు ఆరోపణలు ఉన్నాయి. గాజులరామారం డివిజన్‌లోని మహదేవపురం ఢిల్లీ పబ్లిక్‌స్కూల్ ఎదురుగా, మహదేవపురం చౌరస్తా సమీపంలో, మల్లారెడ్డినగర్ ఫేజ్-1లలో జీప్లస్-2 అనుమతులు తీసుకొని నాలుగు అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ తమ జేబులు నింపుకుంటున్నారని పలు విమర్శలు ఉన్నాయి. ముందుగా టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తమ ఏరియాల్లో ఎక్కడెక్కడ నిర్మాణాలు జరుగుతున్నాయో రెక్కీ నిర్వహించి యజమానులతో బేరసారాలు కుదుర్చుకుంటున్నారు. అటు తర్వాత అధికారులకు తెలియజేయడం, ఒక్కో అంతస్తుకు లక్షల రూపాయలు మాట్లాడుకొని అక్రమ అంతస్తుల నిర్మాణాలకు ఆద్యం పోస్తున్నారు. ఈ నిర్మాణాలపై ఎవరైనా ఫిర్యాదుచేస్తే త్వరలోనే కూల్చివేస్తాం, నోటీసులు ఇస్తామని కాలం గడుపుతున్నారు. ఇదంతా టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది సూచన మేరకే ఇలా అక్రమ అంతస్తులు వెలుస్తున్నాయని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. దీంతోపాటు అక్కడక్కడ అక్రమంగా నిర్మించే షెడ్లకు కూడా పర్మిషన్లు ఇస్తున్నారని షెడ్ల యజమానులు బాహాటంగానే చెప్పడం విశేషం. ఇప్పటికీ గాజులరామారం డివిజన్‌లోని పలుబస్తీల్లో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నా ఏ ఒక్క భవనంపై చర్యలు తీసుకోకపోవడం చూస్తుంటే అధికారులు ఎంతమేర సర్దుకుపోతున్నారో అర్థమవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను అరికడతారో, లేక కూల్చివేస్తారా అని పలువురు వేచి చూస్తున్నారు.


మహదేవపురం చౌరస్తా సమీపంలో అక్రమంగా వెలసిన భవనం

ప్రమాదాలు జరిగితే ఎలా?

సెట్‌బ్యాక్‌లు వదలకుండా నిర్మించే భవనాల్లో ఏదైనా అనుకోకుండా అగ్నిప్రమాదాలు, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగితే భవన యజమానులు నష్టపోవడమే కాకుండా ఈ ప్రభావం పక్క ఇళ్లపై కూడా పడుతుంది. దీనికి తోడు అపార్ట మెంట్ ముందు పార్కింగ్ స్థలం లేక వాహనాలు అడ్డదిడ్డంగా నిలపడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతున్నాయని గాజులరామారం వాసులు అంటున్నారు. ప్రమాదాలు జరగక ముందే అధికారులు మేల్కొని నిబంధనలకు మేరకు భవనాలు నిర్మించుకొనేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


జీప్లస్-5 భవనం

అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇస్తాం

అదనపు అంతస్తుల నిర్మాణంపై ఇంకా మా దృష్టికి రాలేదు. కాలనీలో పర్యటించి ఎక్కడెక్కడ నిర్మాణాలు జరుగుతున్నాయో పరిశీలించి, భవన నిర్మాణ యజమానులకు నోటీసులు ఇస్తాం.

- తుల్జాసింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారి, గాజులరామారం సర్కిల్

పరిశోధనల్లో విద్యావేత్తల కృషి అభినందనీయం

● హెచ్‌సీయూను సందర్శించిన కేంద్రమంత్రి సుకాంత్ మజుందార్

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పరిశోధనల్లో విద్యావేత్తల కృషి అభినందనీయం అని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుకాంత్ మజుందార్ అన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. కేంద్రమంత్రికి వర్సిటీ వీసీ బీజేరావు, రిజిస్ట్రార్ దేవేష్ నిగమ్ సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులు, ఆచార్యులతో కేంద్ర మంత్రి సంభాషిస్తూ.. దేశ భవిష్యత్ రూపకల్పనలో నాణ్యమైన విద్య, ఆవిష్కరణలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. పరిశోధనల్లో విద్యావేత్తల కృషి, కమ్యూనిటీ ఔట్‌రీచ్‌లో శ్రేష్ఠతను సాధించడంలో విశ్వవిద్యాలయం పనితీరును ఆయన ప్రశంసించారు. యూనివర్సిటీ విజన్‌కు అనుగుణంగా విద్య, నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాలపై కూడా మంత్రి చర్చించారు.

లైఫ్ సైన్సెస్ విభాగంలోని యాస్పైర్ బయోనెస్ట్(నాలెడ్జ్ బేస్డ్ ఇంక్యుబేటర్)ను సందర్శించిన మంత్రి అక్కడి స్టార్టప్‌ల అభివృద్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' ప్రచారంలో భాగంగా క్యాంపస్‌లో ఒక మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాల ఉన్నతాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్స్ లేక ప్రయాణికుల అవస్థలు

షాపూర్‌నగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని ప్రధాన రహదారిలో ఉన్న బస్టాపుల్లో కనీస వసతులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఐడీపీఎల్ నుంచి సూరారం, షాపూర్‌నగర్ నుంచి గాజులరామారం వరకు, షాపూర్‌నగర్ ప్రధాన రహదారిలోని జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న బస్‌స్టాపుల్లో కనీసం కూర్చొనేందుకు బెంచీలు లేకపోవడంతో బస్సులు వచ్చే వరకు నిలబడాల్సిన పరిస్థితి ఉంది. సూరారం సాయిబాబానగర్ వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న బస్టాపుల షెడ్లను తొలగించడంతో ప్రయాణికులు రోడ్లపైనే బస్సుల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. గాజులరామారం రోడ్డులోని కార్పొరేటర్ శేషగిరి ఇంటి వద్ద, సంజయ్ గాంధీనగర్ చిల్డ్రన్స్ ఆస్పత్రి వద్ద కూడా ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. ఇదిలా ఉంటే నెహ్రూనగర్, హెచ్ఏఎల్ కాలనీ, ఉషాముళ్లపూడి ఆస్పత్రి, గాజులరామారం చౌరస్తాల వద్ద బస్టాపులు ఏర్పాటు చేసినా బస్సులను స్టాప్‌లకు దూరంగా ఆపుతున్నారు. కొంతమంది డ్రైవర్లు పాత స్టాపుల్లో ఆపుతుంటే, మరికొంతమంది కొత్త బస్టాపుల వద్ద నిలుపుతున్నారు. జంట సర్కిళ్ల పరిధిలో ఉన్న పలు బస్టాపుల వద్ద షెడ్లు, కనీస వసతులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.


జీడిమెట్ల పోలీస్ స్టేషన్ వద్ద వసతులు లేని షెల్టర్


గాజులరామారం రోడ్డులోని చిల్డ్రన్స్ ఆస్పత్రి వద్ద బస్సుకోసం వేచి ఉన్న విద్యార్థులు

బస్టాపులు ఉన్నా ఆగని బస్సులు



పలు ప్రాంతాల్లో ఉన్న బస్టాపుల వద్ద బస్సులు ఆపక, కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. టీఎస్ఐఐసీ కాలనీ చౌరస్తాలో ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉండేవారు, ప్రస్తుతం సబ్‌స్టేషన్ వద్ద బస్సు షెల్టర్‌ను ఏర్పాటు చేయడంతో చౌరస్తా వద్ద వేచి ఉండే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

- శివపార్వతి, షాపూర్‌నగర్

నిరుపయోగంగా బస్టాపులు



గాజులరామారం రోడ్డులోని పలు కూడళ్లలో ఉన్న బస్టాపుల్లో బస్సులు నిలుపకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో ఆటోలు, ద్విచక్ర వాహనాలకు అడ్డాగా మారింది. బస్సులు ఎక్కడ ఆపుతారో తెలియని సందిగ్ధంలో ప్రయాణికులు ఉన్నారు. కొన్ని ప్రాంతాల్లో బస్సు షెల్టర్లు లేక విద్యార్థులు రోడ్డులపైనే వేచి ఉంటున్నారు. ఆర్టీసీ యాజమాన్యం సౌకర్యాలు కల్పించాలి.

- సురేష్, సుభాష్‌చంద్రబోస్‌నగర్


ఆటోలను తనిఖీలు చేస్తున్న పోలీసులు


ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి

ఆటోలపై స్పెషల్ డ్రైవ్

దుండిగల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ఆదేశాల మేరకు మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, దుండిగల్, సూరారం పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసులు ఆటోలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అనంతరం రోడ్డుపై వస్తున్న ఆటోలను ఆపి తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంగించిన ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తూ, సరైన పత్రాలు లేని ఆటోలను పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రోడ్డు భద్రత చర్యలు చేపట్టాలని, ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటిస్తూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సూరారం, దుండిగల్ పోలీసులు పాల్గొన్నారు.

కోటి దీపోత్సవంలో కోలాట ప్రదర్శన

ఎన్టీఆర్ గార్డెన్‌లో జరిగిన కోటి దీపోత్సవంలో గణేష్ మాస్టర్ ఆధ్వర్యంలో గాజులరామారం, రావి నారాయణరెడ్డినగర్ ఈస్ట్, దేవేందర్‌నగర్, నర్సింహబస్తీల మహిళా కోలాట బృందం హాజరై కోలాటాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సంధ్య, అరుణ, రాజ్యలక్ష్మి, శ్రావణి, శిరిషా, జి.శ్రావణి, రజని, ప్రత్యూష, విజయలక్ష్మి, పూజిత, ప్రవళిక, లలిత, నిత్య, సుదీక్ష, దివ్య పాల్గొన్నారు.

- గాజులరామారం (ఆంధ్రజ్యోతి)



అపురూపకాలనీలో పారిశుధ్యం అస్తవ్యస్తం

జీడిమెట్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్‌నగర్ డివిజన్ అపురూపాకాలనీలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో ఎక్కడ చెత్త అక్కడే ఉండటంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో ఉన్న పార్కుల్లో చెత్తను తొలగించడానికి సిబ్బంది ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. కాలనీ ఏర్పడి కొన్ని దశాబ్దాలు గడుస్తున్నా సరైన మౌలిక సదుపాయాలు లేక కాలనీవాసులు సమస్యల పరిష్కారానికి అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. పారిశుధ్య కార్మికులు ప్రతి రోజు రోడ్లను ఊడ్చి చెత్తను తొలగించాలనే నిబంధనలు ఉన్నా విస్మరిస్తున్నారు.

పార్కుల్లో పేరుకుపోయిన చెత్త, ముళ్లకంచెలను తొలగించి శుభ్రపరిచే పనులను కూడా సక్రమంగా నిర్వర్తించడంలేదు. దీని ఫలితంగా కాలనీలో పార్కులు ఉన్నా, అవి నిరుపయోగంగా పడి ఉన్నాయి. కనీసం పార్కులలో కూర్చోవడానికి బల్లలు, పిల్లలు ఆడుకోవడానికి ఎలాంటి ఏర్పాట్లు జీహెచ్ఎంసీ అధికారులు చేపట్టకపోవడంపై స్థానిక వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయాల్లోనే కనిపించే ప్రజాప్రతినిధులు కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

చెత్తను వాహనాల్లో తరలించాల్సిన సిబ్బంది కొన్నిసార్లు ఎక్కడి చెత్తను అక్కడే కాలుస్తున్నారని, దీంతో పొగ, వాసనలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వివరించారు. అధికారులు ఇప్పటికైనా అపురూపకాలనీలో పేరుకు పోతున్న చెత్తచెదారాలను తొలగించాలని కోరుతున్నారు.


కాలనీలో పేరుకుపోయిన చెత్తా చెదారాలు


కాలనీలోనే చెత్తను కాల్చిన సిబ్బంది

సిబ్బంది సక్రమంగా పనిచేయడం లేదు



కాలనీలో చెత్తా చెదారాలు పేరుకుపోయినా, పార్కుల్లో మట్టికుప్పలు ఉన్నా జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవడం లేదు. ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం ఉండటం లేదు.

- తిప్పారెడ్డి, కాలనీ అధ్యక్షుడు

చెత్తను తొలగించడం లేదు



కాలనీలో ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయి ఉంటుంది. గతంలో రోడ్లన్నీ శుభ్రంగా ఊడ్చిన సిబ్బంది ఊడ్చడం మరిచిపోయారు. ఎక్కడ చెత్త అక్కడే ఉండటంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని పార్కులను, కాలనీలో ఉన్న చెత్తను తొలగించేలా చూడాలని కోరుతున్నాం.

- వల్లభనేని రమణ, ప్రధాన కార్యదర్శి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గాజులరామారం, నవంబరు13(ఆంధ్రజ్యోతి): గాజులరామారం విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ మరమ్మతులు, విద్యుత్ వైర్లకు అడ్డుగా వచ్చిన చెట్ల కొమ్మల తొలగింపుకు ఉదయం 11 గంటల నుంచి 4 గంటల వరకు 11కేవీ హెచ్ఏఎల్, ఉషోదయ ఫీడర్లలో, ఉషోదయాకాలనీ, ఫేజ్-1, ఫేజ్-2, ఇందిరానగర్, సీఎంఆర్ స్కూల్ వెనుకవైపు, వీపీనగర్, ఆర్ఎంనగర్ మినీరోడ్డు, మార్కండేయనగర్‌లలో విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు ఏఈ చైతన్య భార్గవ్ ప్రకటనలో తెలిపారు.

షాపూర్‌నగర్

విద్యుత్‌సబ్-స్టేషన్ పరిధిలోని రాజీవ్ గాంధీనగర్, సూరారం ఎస్ఎస్ ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 11 గంటల నుంచి 1.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఈఎస్ఆర్ కృష్ణ తెలిపారు. ఈ ఫీడర్ల పరిధిలోకి వచ్చే రాజీవ్ గాంధీనగర్, మెట్కాన్‌గూడ, శివాలయనగర్ ప్రాంతాల్లో విద్యుత్ కలిగే అంతరాయానికి చింతిస్తున్నామని ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రమాదాలకు నిలయంగా విద్యుత్ స్తంభాలు

షాపూర్‌నగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సూరారం ప్రధాన రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాలు రోడ్డుకి ఇరువైపులా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. సూరారం ఎక్స్ రోడ్, జయరాజ్ కంపెనీ, హనుమాన్ టెంపుల్ తదితర ప్రాంతాల్లో గతంలో ఎన్నో ప్రమాదాలు జరిగాయి. ప్రమాదాల నివారణకు విద్యుత్ అధికారులు వీటిని తొలగించి, రోడ్డుకు దూరంగా వేయాలని పలువురు కోరుతున్నారు. ప్రధాన రహదారి విస్తరణ జరగకముందు స్తంభాలు రోడ్డుకు దూరంగా ఉండేవి. విస్తరణలో భాగంగా స్తంభాలు దగ్గరగా కావడంతో ప్రమాదకరంగా మారాయి.అధికారులు తక్షణమే స్పందించి రోడ్డుకు ఆనుకొని ఉన్న ఈ విద్యుత్ స్తంభాలను దూరంగా వేయాలని స్థానికులు కోరుతున్నారు.


సూరారం ఎక్స్ రోడ్డులో ప్రమాదంగా ఉన్న విద్యుత్ స్తంభం


జయరాజ్ కంపెనీ వద్ద విద్యుత్ స్తంభం

యంత్రంలో పడి కార్మికుడి మృతి

జీడిమెట్ల, నవంబరు13(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు యంత్రంలో పడి ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీహార్‌కు చెందిన శివశంకర్‌పాశ్వాన్(33) బతుకు దెరువు కోసం నగరానికి వచ్చి దూలపల్లి గ్రామంలో నివాసముంటున్నాడు. రామిరెడ్డినగర్ ప్రాంతంలో ఉన్న గోవర్ధన అట్టలకంపెనీలో మెషిన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం 1గంట సమయంలో పనిచేస్తుండగా యంత్రంలో పడి మృతి చెందాడు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు.

కత్తితో బెదిరించి స్నాచింగ్‌లు : ఇద్దరు మైనర్ల అరెస్టు

● ఐమాక్స్ వద్ద న్యాయవాదిపై దాడి చేసింది వీరే..

మంగళ్‌హాట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఐమాక్స్ వద్ద న్యాయవాది కల్యాణ్‌పై దాడి చేసి మొబైల్ ఫోన్ ఎత్తుకెళ్లిన కేసును పోలీసులు ఛేదించి ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. బుధవారం ఆబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ ఆకుల చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు గన్‌ఫౌండ్రిలోని ప్రసాద్ అపార్ట్‌మెంట్ వద్ద వాచ్‌మెన్‌ను ఇద్దరు కత్తితో బెదిరించి మొబైల్ ఫోన్‌ను లాక్కెళ్లారు. అక్కడి నుంచి వారు వచ్చిన హోండా యాక్టివాపై ఐమాక్స్ వద్దకు వెళ్లారు. అక్కడ వాకింగ్ చేస్తున్న న్యాయవాది కల్యాణ్ వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌ను దొంగిలించేందుకు యత్నించారు. ఆయన ప్రతిఘటించడంతో కత్తితో బెదిరించారు. ఈ పెనుగులాటలో న్యాయవాది కల్యాణ్‌కు గాయాలయ్యాయన్నారు. సెంట్రల్ జోన్ పరిధిలో ఇదే తరహాలో రెండు కేసులు నమోదు కావడంతో డీసీపీ నేతృత్వంలో రెండు ప్రత్యేక టీమ్‌లతో దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా రాంనగర్ చేపల మార్కెట్ వద్ద ఓ మైనర్‌ను అదుపులోకి తీసుకుని అతడి వద్ద దొంగిలించిన రెడ్‌మీ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనిచ్చిన సమాచారం మేరకు చాంద్రాయణగుట్ట బండ్లగూడ వద్ద మరో మైనర్‌ను అదుపులోకి తీసుకుని, అతడి వద్ద న్యాయవాది కల్యాణ్ నుంచి దొంగిలించిన మొబైల్ ఫోన్, దాడికి ఉపయోగించిన కత్తి, హోండా యాక్టివాను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారి ఆధార్‌కార్డుల ఆధారంగా మైనర్లని తేలిందని, వారి వయసును నిర్ధారించేందుకు ఉస్మానియా ఆస్పత్రిలో టెస్ట్‌ల కోసం పంపిం చామన్నారు. గతంలో వారిపై ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో మొబైల్ స్నాచింగ్ కేసు నమోదైందన్నారు. వారిని రిమాండ్‌కు తరలించిన అనంతరం కస్టడీకి తీసుకుని విచారిస్తామని ఏసీపీ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణలో ఉన్నత విద్యపై సదస్సు

టీ-హబ్‌తో ఒప్పందం చేసుకున్న యూఈఎల్

హైదరాబాద్ సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో పరిశ్రమ, విద్యారంగం స్పందించాల్సిన తీరుపై చర్చిస్తూ 'పర్యావరణ పరిరక్షణలో ఉన్నత విద్య : పరిశ్రమ, విశ్వవిద్యాలయాల భాగస్వామ్యం' అంశంపై ఓ కార్యక్రమాన్ని రాయదుర్గంలోని టీ-హబ్ వద్ద బుధవారం నిర్వహించారు. యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్ లండన్ (యూఈఎల్), సిమెన్స్, టీ-హబ్‌లు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూఈఎల్ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ క్యాంపస్) ప్రొఫెసర్ పాల్ మార్షల్, డైరెక్టర్ గుల్నార్ స్టోవేర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పరిశ్రమ, విద్యారంగ భాగస్వామ్యాలను నిర్మించడంలో సవాళ్లు, అవకాశాలపై చర్చించారు.

విశ్వవిద్యాలయాలు హరిత ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో తమ పాఠ్యాంశాలను ఎలా సమలేఖనం చేయవచ్చనే అంశాలను చర్చించారు. పర్యావరణ పరిరక్షణ నాయకులను తీర్చిదిద్దడంలో ఉన్నత విద్య పాత్రను వక్తలు ప్రముఖంగా ప్రస్తావించారు.

దీనిలో భాగంగా సిమెన్స్‌తో యూఈఎల్ ఒప్పందం కూడా చేసుకుంది. యూఈఎల్ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపరంగా పరిశ్రమ అనుభవం పొందేందుకు ఈ భాగస్వామ్యం తోడ్పడనుందని పాల్ మార్షల్ అన్నారు. భారత దేశపు ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసేందుకు తాము కట్టుబడి ఉన్నామని ఆయన చెబుతూ 2030 నాటికి నికర సున్నా ఉద్గారాలను లక్ష్యంతో తాము ముందుకు వెళ్తున్నామన్నారు. సీమెన్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ విభాగం వైస్ ప్రెసిడెంట్ ఫేయ్ బౌసర్ మాట్లాడుతూ ఉన్నత విద్యాసంస్థల భాగస్వామ్యంతో పర్యావరణ అనుకూలత గురించి తాము విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు.

తాగునీటి సమస్యలను పరిష్కరించాలి : సీపీఐ

నిజాంపేట్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్‌లో నెలకొన్న తాగునీటి సమస్యలను తీర్చాలని సీపీఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ నాయకులతో కలిసి కార్పొరేషన్ వాటర్‌బోర్డు డిప్యూటీ జనరల్ మేనేజర్ చంద్రమోహన్‌కు బుధవారం ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ కార్పొరేషన్‌లో పేదలు నివసించే బస్తీల్లో ఒకవిధంగా, విల్లాలు, గ్రేటర్ కమ్యూనిటీలకు ఇంకోవిధంగా తాగునీరు సప్లయ్ జరుగుతుందన్నారు. నిజాంపేట్ 33వ డివిజన్ మదర్‌థెరిస్సా విగ్రహం నుంచి విజయ్ టింబర్ విల్లా వరకు నీళ్లు వదిలిన ప్రతిసారి 5 గంటలపాటు తాగునీరు సప్లయ్ అవుతుంది. ఇంద్రన్నకాలనీ, ఎన్టీఆర్‌నగర్, సాయినగర్, రాజీవ్‌గాంధీనగర్, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్‌గృహకల్ప, నిజాంపేట్ గ్రామం, జర్నలిస్టు కాలనీల్లో, పేదలు నివసించే ప్రాంతంలో 2 గంటలు మాత్రమే తాగునీరు విడుదల చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, రవీందర్‌రావు, ఆశియాదయ్య, మల్లయ్య పాల్గొన్నారు.


మేనేజర్ చంద్రమోహన్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు